# ముందడుగు

“నిజమైన రచయిత సంఘానికి ఎంత సన్నిహితంగా వుంటే అంతగా ప్రజాదరణ సంపాదించుకోగలడు, ప్రజాసేవ చెయ్యగలడు. మనం రచయితలం అయివుండి నిత్య జీవితం నుంచి పారిపోయి లాభం లేదు” అన్నాడు నారాయణ బాబు.

ఒకనాటి సాహిత్యగోష్ఠిలో ఈ చర్చ జరిగింది. అనేక మంది రకరకాలుగా ఈ విషయం గురించే మాట్లాడారు.

“నిత్యజీవితం ఒక చెంప అనుభవిస్తూనే వున్నాంగా తమ్ముడూ, ఏముంది యిందులో. నిత్యజీవితం గురించి మన కంటె జనసామాన్యానికి ఎక్కువగా తెలుసు. సమస్య వాస్తవికమైనదే తీసుకోవాలి. కాస్త పైకిపోయి రాయాలి.” అన్నాడు జగన్నాథం.

“మీరు కాస్త వివరంగా చెప్పాలి” అన్నాడు శాస్త్రి.

“ఉన్నది వున్నట్లుగా చెప్పి ప్రయోజనం ఏమిటండి. ఆదర్శం జోడించి రాయాలి. మానవ ప్రకృతిని బాగా అర్థం చేసుకుంటే ఒక రహస్యం మనకి బోధపడుతుంది. తనకంటె భిన్నమైనది, అందుబాటులో లేనిదీ ఏదైతే వుంటుందో మనసు అటువైపుకి ఆకర్షింపబడుతూంటుంది. ఒక ఉదాహ

రణ చెబుతాను. రామాయణ మహాభారతాది కావ్యాలు ఈనాటికీ ప్రజల జీవితాలతో పెనవేసుకునిపోయి ఆరాధ్య గ్రంథాలుగా పరిగణించబడుతున్నాయంటే ఏమిటి కారణం? ఆపాత్రలకీ మనకీ పోలికలున్నాయి. వారుకూడా మనలాగానే జీవితంలో పోగొట్టుకుంటారు. అధర్ములు బాధలు పెడతారు. ధర్మాత్ములు కష్టాలు పడతారు. దుఃఖిస్తారు. వారూ మనలాగే పోగొట్టుకుంటారు. అయినా మనకంటె భిన్నంగాను, ఎంతో ఎత్తుమీద వున్నట్టు కనిపిస్తారు. వాళ్ళు దేనికో కట్టుబడి వుంటారు. ఒక్క అబద్ధం ఆడితే ఎంతో పెద్ద ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చు. అయినా అబద్ధం ఆడరు. అడుగడుగునా వాళ్ళు ధర్మంకోసరమే జీవిస్తారు. చదివినవాళ్ళు అనుకుంటారు. మన పెద్దలూ అలాగే చెబుతూంటారు, అలా ఆదర్శంగా జీవించమని. అతను ఎంత గొప్పగా వుంటుంది. అలా జీవిస్తే, అనిపిస్తుంది. మన మనసు అటువైపుగా లాగుతూంటుంది. అయినా మనం అలా జీవించలేం. ఆగమ్యం మనం చేరలేకపోవచ్చు. అయినా ఆ ఆశయంవైపుకి మనం సాగించే ప్రయాణంలో మనం వెలుగువైపుకే సాగుతున్నాం_ అని ఖచ్చితంగా చెప్పకోవాలి_ ఒప్పుకుని తీరాలి" అన్నాడు జగన్నాథం.

"అలాంటి అభ్యుదయ రచయితలలో ఒకరిద్దరిని? ఉదాహరణ చెప్పండి." అన్నాడు శాస్త్రి.

"శరత్ రవీంద్రులు ఆకోవను చెందినవాళ్ళే" అన్నాడు జగన్నాథం.

"అంటే మీ ఉద్దేశం పాత్రల్ని నేలవదిలి సాము చేస్తూంటామన్నమాట. ఇది ప్రపంచం జగన్నాధంగారూ. యిక్కడ గర్భదరిద్రం విలయతాండవం చేస్తూంది. పందిరి మంచంమీద పడుకుని చదువుకునే యిలాంటి పుస్తకాల్లోంచి ఈ ప్రపంచాన్ని చూస్తే అంతా రంగురంగులుగా కనిపించటంలో ఆశ్చర్యం లేదు. కాని ఒకసారి అటువైపు చూడండి" అన్నాడు నారాయణబాబు; కొద్ది దూరంలో పెద్ద పెద్ద భవనాలవార నున్న పాకలవైపు చూపిస్తూను.

నేల బారుగావున్న ఆ పాకలముందు ఓ ముసల్ది మనవడితో ఉత్సాహంగా ఆడుకుంటూంది.

"ఈ తారతమ్యాలు బాధాకరమైనవే. ఇవి సాధ్యమైనంతవరకూ తగ్గించవలసిందే. అయితే సుఖసంతోషాలనేవి పూర్తిగా ఆర్థికపరమైనవికావు. డబ్బు చాలా అవసరం కాదనను. కాని అదే ముఖ్యం అనుకోను. ఆదృశ్యం యిదే ఋజువు చేస్తూంది" అన్నాడు జగన్నాధం.

నారాయణబాబుకి బాగా కోపం వచ్చినట్టుంది. బుర్ర అటూ యిటూ చికాగ్గా వూపుతూ "మీ ధోరణి ఎలాగుందంటే_శవాన్ని ఎదట పెట్టుకుని శృంగార గీతాలు ఆలపిస్తున్నట్టుగా వుంది" అన్నాడు.

# 2

ఆనాడు ఆదివారం. ఓ సంఘటన జరిగింది. దాంతో నారాయణబాబుకి ఆ వూరికి ఋణం తీరిపోయింది. జరిగిందేమిటంటే ఆనాటి రాత్రి నారాయణబాబు ఇతర మిత్రులతో ఏదో మాట్లాడుతూన్న సందర్భంలో ఓ యువతి నేరుగా వచ్చి నారాయణబాబు పాదాలమీద పడిపోయిందట. ఆ యువతి మాటల్నిబట్టి అసలు రహస్యం అందరికీ తెలిసిపోయి నానాఅల్లరీ అయిపోయింది. ఆ మర్నాడు వెళ్ళి చూస్తే నారాయణబాబు గది తాళంవేసి వుంది. ఒచ్చి అడిగిన వాళ్ళందరికీ యింటాయన చెప్పిన జవాబు "అతగాడు ఇల్లు ఖాళీ చేసి పోయాడని."

ఆ తర్వాత ఆ యువతి ఆత్మహత్య చేసుకుంది.

ఈ విషయం మా రచయితల సమావేశంలో చర్చకు వచ్చింది.

"ఛ! రచయితలకే తలవంపు ఒక అమాయకురాలి జీవితాన్ని మంటగలిపి పారిపోయాడు" అంటూ అంతా ఏవగించుకున్నారు.

నారాయణబాబుకి చిన్నప్పుడే వివాహం అయింది. కొన్నాళ్ళ కాపరం తర్వాత నారాయణబాబు ఆమెని వదిలేశాడు. కారణం తను జీవితంలో సాధించబోయే మహత్తర వుద్యమాలకి ఆమె చాదస్తం అడ్డుగా వుండుటయే. ఇది

నారాయణబాబు స్వయంగా చేసుకునే కారణం. మళ్ళీ ఆ తర్వాత అతను వివాహం చేసుకోలేదు

## 3

పక్కగుమాస్తా హరిప్రసాదు ఓనాడు వున్నట్టుండి "నారాయణబాబు మీకు తెలుసునాండి" అని అడిగాడు.

"అహా తెలుసు" అన్నాను.

హరిప్రసాదు ఫైలు మూసేస్తూ "నారాయణబాబు రచనలంటె నాకు చాలా యిష్టం" అన్నాడు.

నారాయణబాబు జీవితంగురించి అతనికి చెప్పి నారాయణబాబు పట్ల అతగానికున్న గౌరవభావం చెడగొట్టటం యిష్టంలేక వూరుకున్నాను.

"ముఖ్యంగా నారాయణబాబుగారు రచించిన 'ముందడుగు' నవల నాకు చాలా యిష్టం." అన్నాడు హరిప్రసాదు.

"ఎందుకని?"

హరిప్రసాదు "అందులో కథానాయకుడు ఓ పేద బాలికను పెళ్ళి చేసుకుని ఆమె జీవితం కాపాడతాడు. సమాజం అతన్ని చాలా బాధలు పెడుతుంది. అయిన వాళ్ళంతా వ్యతిరేకిస్తారు. అయినా అతగాడు తల్లీదండ్రి లేని

ఆ అనాధ బాలికను పెళ్ళి చేసుకుంటాడు. ఆ నవల చదివి నేనూ ఓ సాహసం చేశాను." అన్నాడు హరిప్రసాదు.

నేను ఆశ్చర్యంగా "ఏం చేశారు?" అన్నాను.

"నేనూ అలాగే తల్లీ తండ్రీ లేని ఓ అనాధ బాలికను పెళ్ళి చేసుకున్నాను. నా తల్లి తండ్రులు, బంధువులు ముక్కూ మొహం తెలియని ఓ పేద బాలికను చేసుకున్నందుకు కొన్నాళ్ళు నన్ను వెలివేశారు. తర్వాత మళ్ళీ దారిలోకి వచ్చారనుకోండి..."

నా ఆశ్చర్యానికి మితిలేదు.

ఆనాటి సాహిత్యగోష్ఠిలో ఈ ప్రస్తావన తెచ్చాను. మర్చిపోయిన నారాయణబాబు మళ్ళీ ఆనాటి సమావేశంలో చర్చనీయాంశమైపోయాడు.

జగన్నాథం "చచ్చిపోయిన నారాయణ బాబుకి హరిప్రసాద్ ప్రాణం పోశాడు. నారాయణబాబు రచయితల ప్రపంచానికి తెచ్చిన మచ్చ ఏదైనావుంటే అది కాస్తా తుడిచేశాడు _ నారాయణబాబుతో ఓసారి అన్నాను "మీ రచన లన్నిటిలోకి నాకు నచ్చిన నవల మీ ముందడుగు" అని గుర్తున్నదా?" అని అన్నాడు

ఒకనాటి సాహిత్యగోష్ఠిలో నారాయణబాబు 'ముందడుగు' నవల ప్రస్తావన రావటము, అంతా ఏకగ్రీవంగా ఆ రచనను మెచ్చుకోవటమూ జరిగింది. అందులో నారాయణ బాబు అరాచక వాదంవైపు మొగ్గుచూపకుండా శాంతియుతమైన విధానాలద్వారా సంఘంలో పరిణామాన్ని బలపరిచాడు.

"రచయిత తాను చెప్పిందాన్ని తానే ఆచరించలేక పోవచ్చు. కాని పాఠకులు తాను చెప్పిందాన్ని గాఢంగా నమ్మి ఆచరణలో పెట్టగలిగి వుండవచ్చు. అందుకే మనం ఏం చెప్పినా చాలా జాగ్రత్తగా చెప్పాలి, మెలుకువగా వుండాలి" అన్నాడు జగన్నాథం.

"మీరేమైనా చెప్పండి. రచయితలం అయివుండి సమాజానికి దూరంగా తప్పుకోలేం _ రచయిత సంఘానికి ఎంత సన్నిహితంగా వుంటే అంత ప్రజాదరణ సంపాదించుకోగలడు. అంతగా ప్రజాసేవ చెయ్యగలడు. మనం రచయితలం అయి వుండీ నిత్యజీవితంనుండి పారిపోయి లాభంలేదు" అన్నాడు శాస్త్రి.

ఒక్కసారి అందరూ ఫక్కుమని నవ్వేశారు.